ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



**(రాజమండ్రిలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 19-8-98)**

**ప్రియమైన ఆత్మ బంధువుల్లారా,**

మీకుభౌతికమైన సంపదలు ఎన్నిఉన్నా దుఃఖం వస్తూ ఉంటే వాటి వలన ప్రయోజనం లేదు. అందువలన మానవుడిని దుఃఖంలేనిస్థితికి తీసుకొని వెళ్ళటానికి మహాత్ములు అందరూ ప్రయత్నం చేసారు. బుద్ధుడు ప్రయత్నంచేసినా, యేసుప్రయత్నంచేసినా, కృష్ణుడు ప్రయత్నంచేసినా మానవుడిని దుఃఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటానికే చూసారు. మనకు దుఃఖకారణం బయటలేదు, మనలోపలే అహంభావన రూపంలో ఉంది. మనకు గాఢనిద్రలో అహంభావనలేదు. అందుచేత అక్కడ దేహం సమస్యలేదు, మానసిక సమస్యలేదు, దేవుడు ఉన్నాడాలేడా అనే తర్కం సమస్యకూడా అక్కడ లేదు కాని అక్కడ మనంఉన్నాము సుఖంగాఉన్నాము, శాంతిగాఉన్నాము. జాగ్రదావస్థలోనికి రాగానే మొదట నేను అనేతలంపు వస్తుంది. అదిదేహంతో తాదాత్మ్యంచెందుతుంది. తరువాత దానికి ఇతర తలంపులు వస్తాయి. అదే దుఃఖానికి కారణం. బాహ్యపరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఎప్పుడైతే అహంభావన నశించిందో అప్పుడు వాడికి స్వతంత్రమైన సుఖం, శాంతి వాడి హృదయంలో నుండి వచ్చి సహస్రారమును ముంచుతుంది. ఈ స్థితిని పొందటానికి శరీరం మరణించే వరకూ ఆగనక్కరలేదు. భగవంతుడు మనహృదయంలో ఉన్నాను అని చెప్పాడు. మన హృదయంలో భగవంతుడు ఉన్నాడో, లేడో మనకు తెలియటంలేదు. కాని భగవంతుడు మనకు దేహాన్ని, మనస్సును ఇచ్చాడు. ఇవిరెండూ మనకు తెలుస్తున్నాయి. భగవంతుడు మనకు ఇచ్చిన దేహాన్ని, మనస్సును హృదయంలో ఉన్న భగవంతుడిని తెలుసుకోవటానికి ఎంతవరకు ఉపయోగించుకొంటున్నావో అంత వరకు నీ జీవితాన్ని సద్వినియోగం చేసినట్లు లెక్క. పారమార్థికసత్యం అనేది నీ హృదయంలో ఉంది. దానిని తెలుసుకొంటే నీవు సుఖపడతావు,అది తెలియకపోతే దుఃఖం నిన్ను వెంటాడుతుంది. మరణం రాకముందే హృదయంలో ఉన్న పరమసత్యాన్ని ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడికి కమింగ్ లేదు, గోయింగ్ లేదు. మీరు భక్తిమార్గంలో ప్రయాణంచేయండి, కర్మమార్గంలో ప్రయాణంచేయండి, జ్ఞానమార్గంలో ప్రయాణంచేయండి. ఏ మార్గంలో ప్రయాణంచేసినా నీవు సిన్సియర్‌గా పనిచేస్తే భగవంతునిలో ఐక్యమవుతావు.

నిద్రకు, చావుకు తేడా ఏమిటి చెప్పండి. పెద్దతేడాఏమీలేదు నిద్రకూడా చిన్న చావు వంటిది. నిద్రలో దేహంకనబడదు, లోకం కనబడదు. మరణం తరువాత కూడా దేహం కనబడదు, లోకం కనబడదు. మనకు నిద్ర అంటే భయంలేదు, మరణంఅంటే భయం కలుగుతుంది. నిద్రపోయేవాడు ఏమనుకొంటాడు అంటే రేపు ఉదయం మనం లేవవచ్చు, మనపని మనం చేసుకోవచ్చు

అనుకొంటాడు. ఆ తలంపు వలన అతనికి భయం కలగటంలేదు. చని పోయేవాడు ఇంక మనం ఉండము అనుకొంటాడు. ఆ తలంపు వలన అతనికి భయం కలుగుతోంది. మీరు ఎంత కాలం యోగాభ్యాసం చేసారు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నాకు వియోగం ఉంటే కదా యోగాభ్యాసం చేయటం అని భగవాన్ అన్నారు. విభక్తి ఉన్నవాడికి భక్తి అవసరం. వియోగం ఉన్నవాడికి యోగం అవసరం. రమణమహర్షికి యోగాభ్యాసంచేయటం వలన జ్ఞానంకలుగలేదు, మరణానుభవం ద్వారా ఆయనకుజ్ఞానం కలిగింది. శరీరం మరణించినా ఏవస్తువు కయితే మరణంలేదో ఆవస్తువేతాను అనే అనుభవం మరణానుభవం ద్వారా ఆయనకు కలిగింది. అందుచేత ఆయన ఋషి అయ్యాడు. ఋషి అనేవాడు బయటలేడు. మీహృదయంలోనే ఉన్నాడు. బయటఉన్న ఋషులను కాదు మీరు తెలుసుకోవలసింది, మీ లోపలఉన్న ఋషిని తెలుసుకొంటే మీకు సుఖం తెలుస్తుంది.

మనం పూజ చేసినా, జపంచేసినా, ధ్యానంచేసినా, నదులలోస్నానాలు చేసినా ఎందుకు అంటే అహంభావన నుండి విడుదల పొందటానికే. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. కాని మనం చేసే పొరపాటు ఏమిటి అంటే మనంచేసే పని ద్వారా, మాట్లాడే మాట ద్వారా అహంభావనను పెంచుకొంటున్నాము గాని అహంభావన నుండి విడుదల పొందటానికి మనంప్రయత్నంచేయటంలేదు. అహంభావన నుండి ఎలా విడుదలపొందాలి అని మనం చూడటంలేదు ఎంతసేపు ఈ అహంభావనకు ఫుడ్ ఎక్కడ దొరుకుతుందా అనిచూస్తున్నాము ఇంక అది ఎలాపోతుంది. హృదయంలో ఉన్న వస్తువును మనం ఏమీ కనిపెట్టనక్కరలేదు. దానిని తెలుసుకోవటానికి ఏదైతే అడ్డువస్తోందో దానిని తొలగిస్తే సరిపోతుంది. ఒకటిజ్ఞాపకం ఉంచుకోండి ఈ జన్మలో మీకు ఏదైనా దుఃఖంఉంది అనుకోండి. ఇది పోతే చాలు అనుకోవద్దు. మీలో అజ్ఞానం ఉన్నంతసేపు ప్రతీ జన్మలో దుఃఖం ఏదోరూపంలో మిమ్మల్ని వెంటాడుతుంది. కొంతమంది ప్రతీచిన్న విషయానికి రియాక్టు అవుతారు. ఏక్షన్ మంచిది గాని రియాక్షన్ మంచిది కాదు. ప్రతీ చిన్నవిషయానికి రియాక్టు అయ్యేవాడు వాడు అశాంతికి గురి అవుతాడు, ఇంటిలోని వారికి అశాంతిని తీసుకొనివస్తాడు, సమాజమునకు అశాంతిని పంచిపెడతాడు.

ధర్మంఆచరిస్తే సంసార తాపత్రయంతగ్గిస్తుంది దుఃఖంతగ్గిస్తుంది, మరణంలేనిస్థితికి నిన్ను తీసుకొనిపోతుంది, లోపల భయంఉంటే బాధలువస్తూనే ఉంటాయి. వారు ఏమనుకొంటారు, వీరు ఏమనుకొంటారు అనేభయం వలన బాధలువస్తాయి. వీరు, వాళ్ళులేరు, ఉన్నది ఒక్కటే ఈ విభజన వలననే భయంవస్తోంది. భేదబుద్ధి వలననే భయంవస్తోంది. ఎప్పుడైతే భౌధబుద్ధి వచ్చిందో మనిషికి మోహం కలుగుతుంది. ఎప్పుడైతేమోహం కలిగిందో వాడికి సంసారం వస్తుంది. సంసారం ఎప్పుడైతే వచ్చిందో వాడికి తాపత్రయం వస్తుంది. అక్కడ నుండి వాడు జనన, మరణ ప్రవాహంలో కొట్టుకొనిపోతాడు. ఏ సద్గురువు వలననో వాడు దీని నుండి బయటకు రావాలిగాని కేవలము వాడితెలివి తేటలు సరిపోవు మానవుడు ప్రయత్నం చేయాలి, కాలం కలిసివస్తుంది. అప్పుడు దైవానుగ్రహం వలన ఒడ్డుకు వస్తాడు. మనిషిదేహం పుట్టినప్పుడు పుట్టలేదు, దేహం మరణించినప్పుడు మరణించడు. అహభావన పుట్టినప్పుడు పుట్టాడు, అహభావన తొలగించుకొన్నప్పుడు ఇంక పునర్జన్మ రాదు, అప్పుడు

అమృతస్థితిని పొందుతాడు. దేహంయొక్క పుట్టుక పుట్టుక కాదు, దేహంయొక్క మరణం మరణంకాదు. ఇవిఅన్నీ స్వప్నంలో భాగములు.

నదికి ఆనకట్ట ఎందుకు కడుతున్నారు. నదిలోప్రవహించి సముద్రంలో కలిసిపోయే నీటిని ఆపి కాలువల ద్వారా పొలాలకు పంపి పంటలను పండించటానికి ఆనకట్ట కడతారు. నీవు చేసే ధ్యానం కూడా ఆనకట్ట వంటిది. నీకు వచ్చే ఉపయోగంలేని తలంపులను ధ్యానం ఆపుచేస్తుంది. ధ్యానం వలన ఏకాగ్రత వస్తుంది, పవిత్రత వస్తుంది. ఇవి భగవదనుభవం పొందటానికి నీకుసహకరిస్తాయి. ధనంవలన భోగంవస్తుంది, జ్ఞానం వలన మోక్షం వస్తుంది. భగవంతుడు నీకు ధనంఇస్తే, తెలివిఇస్తే వాటిని సద్వినియోగం చేస్తే నీకుజ్ఞానం కలుగుతుంది, వాటిని దుర్వినియోగం చేస్తే చీకటి లోకాలకుపోతావు.

మీరు దేవుడిని ఏమీకనిపెట్టనక్కరలేదు. ఉన్నదేవుడిని గుర్తించటమే. అయితే గుర్తింపుకు ఎందుకు రావటంలేదు ? అహంభావన వలన రావటంలేదు. ఎవడైతే ప్రయత్నంచేసి, యోగాన్ని అభ్యసించి, భగవంతుడిని ఉపాసనచేసి జ్ఞానసంపదను పెంచుకొని అహంభావనలో నుండి విడుదల పొందుతున్నాడో వాడు అమృతస్థితిని పొందుతాడు అదే జీవితంయొక్క పరమార్థం. వాడే సుఖి అవుతాడు. ఒక అవతార పురుషుడితోగాని, జ్ఞానితో గాని నీకు మానసికఅనుబంధం ఉండాలి. మానసికఅనుబంధం వలన నీ మనస్సులో ఉన్న పునర్జన్మకారణాలు నీకు తెలియకుండా రాలిపోతాయి. మంచిగుణాలు మనస్సులోనే ఉన్నాయి, చెడుగుణాలు మనస్సులోనే ఉన్నాయి.శాస్త్రం ఏమి చెవుతోంది అంటే మంచిగుణాలు అలవర్చుకో, చెడుగుణాలు విడిచిపెట్టు అని చెపుతోంది. గుణం అత్మకాదు, గుణం పారమార్థిక సత్యం కాదు, చావులేని స్థితి గుణంలో లేదు చైతన్యంలో ఉంది. అయితే మంచి గుణాలు నేర్చుకోండి అని శాస్త్రం ఎందుకు చేపుతోంది అంటే మంచి గుణాలు మన హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి సహకరిస్తాయి. చెడుగుణాలు మన స్వరూపం నుండి మనలను దూరం చేస్తాయి. ఓ అరుణాచలా! నాకు తల్లి ప్రేమ ఎలా ఉంటుందో తెలుసు, తండ్రి ప్రేమ ఎలాఉంటుందో తెలుసు, బంధువుల ప్రేమ ఎలాఉంటుందో తెలుసుకాని నీ ప్రేమతో చూస్తే ఈ ప్రేమలు సరికావు. ఎందుచేతనంటే మనుషుల ప్రేమ వెనకాల స్వార్థం ఉంటుంది, కారణం ఉంటుంది. కారణం ఉన్న ప్రేమ నిజంకాదు, కారణం లేని ప్రేమ నిజం. గురువు యొక్క ప్రేమ ఇంద్రియాలకు అందేది కాదు, మనస్సుకు అందేదికాదు మనస్సును మురికిగుంటలతో నింపుకున్న మానవులకు ఈ ప్రేమ అందదు.

నన్ను ఎవరిని గురువుగా తీసుకోమంటారు అని అడిగితే నీకు గురి ఎక్కడ ఉందో వాడిని గురువుగా తీసుకోమని చెప్పారు. నన్ను గురువుగా తీసుకో అని అయన చెప్పలేదు ఏది ఆయనమీద పెట్టుకొని చెప్పలేదు అది ఆయన టీచింగ్‌లోని గొప్పదనం. నీక్షేమం ఎవడైతే కోరుతున్నాడో, నీ ఉజ్వలమయిన భవిష్యత్తును ఎవడైతే ఆకాంక్షిస్తున్నాడో వాడు ఎక్కడ ఉన్న నీ పొరుగువాడే. గురువు దేహం దగ్గర ఉందా దూరంగా ఉందా అనేది ముఖ్యం కాదు. గురువు తో నీకు మానసిక అనుబంధం

ముఖ్యం, గురువు పట్ల నీకు ఉన్న గురి ముఖ్యం. ఎవరి సమక్షంలో నీమనస్సు యొక్క చాపల్యం ఆగుతోందో, ఎవరిని స్మరించుకొంటే నీకు ఆనందం, శాంతి కలుగుతోందో వాడిని గురువుగా తీసుకో గురువు అనుగ్రహంలో పడినవారు అందరూ తరించబడతారు. అయితే వారి అర్హతను బట్టి, యోగ్యతను బట్టి కొద్దిగా టైమ్ తేడా గాని అందరూ తరించబడతారు. మనకు ఏది మంచిదో మన కంటే ఎక్కువగా గురువుకు తెలుసు. మనకెప్పుడు, ఎక్కడ, ఏది చేయాలో ఆయనే చూసుకొంటాడు. ఎప్పుడు మనలను జ్ఞానంతో అలంకరించాలో ఆ మూహర్తం ఆయనే పెట్టుకొంటాడు. కాని మనం చేసే పని ఇష్టంతో చేయాలి. గురువు పట్ల అకారణ భక్తి ఉంటే జ్ఞాన సామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు. ఆత్మశాంతి ఎటువంటిది అంటే దానితో పోల్చడానికి ఈ సృష్టిలో ఏదిలేదు అన్నారు భగవాన్. నీ పునర్జన్మకు కారణాలు నీ మనస్సులో ఉన్నాయి. గురువు చేసే పని ఏమిటి అంటే ఆ కారణాలు నీకు తెలియచేస్తాడు. ఆ కారణాలు నీకుతెలియజేసి వాటిని బయటకులాగి కాల్చి బూడిద చేస్తాడు.

భోగదృష్టి ఉన్నవాడికి విషయచింతన పెరిగిపోతూ ఉంటుంది, వాడికి అంతర్దృష్టి కలుగదు, ఆత్మజ్ఞానం కలుగదు. మహాత్ముల సన్నిధిలో నీ మనస్సు భోగంవైపు నుండి యోగం వైపుకు మళ్లించబడుతుంది. నీ హృదయంలో ఉన్న శాంతి నీకు అందినప్పుడు నీవు శాంతికోసం నీ శరీరం మీద ఆధారపడి ఉండనక్కరలేదు, ఇంద్రియాలకు సంబంధించిన విషయాల మీద ఆధారపడి ఉండ నక్కరలేదు. నీ హృదయంలో ఉన్న ఆత్మకు సంబంధించిన శాంతి నీకు అందుతూ ఉంటే నీ మనస్సులో ఉన్న వాసనలు, కోరికలు, చిల్లరి తలంపులు అన్నీ కూడా రాలిపోతాయి. గురువు సమక్షంలో నీ మనస్సు నిర్మలమవుతుంది, నిశ్చలమవుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది అంతేకాదు ఒకోసారి గురువు సమక్షంలో సమాధిస్థితి వచ్చినా ఆశ్చర్యపడనక్కరలేదు. జ్ఞానం యొక్క వైభవం అటువంటిది. అంత గొప్పదైన జ్ఞానం పొందటానికి ఎవరూప్రయత్నం చేయటంలేదు కారణం ఏమిటిఅంటే దాని విలువ మనకు తెలియటంలేదు. నీవు ప్రయాణించే మార్గాన్ని గురువు చూస్తూ ఉంటాడు. నీతో తిరుగుతూ ఉంటాడు, నీతో మాట్లాడుతూ ఉంటాడు. నీ జీవితం ఎప్పడు మలుపుత్రిప్పాలో ఆయన చూసుకొంటూఉంటాడు. నీ కర్తృత్వ భారాన్ని తగ్గిస్తాడు. అంతానేనే అనుకొనే నీ బుద్ధిని మార్చి అంతాగురువే అనే భావన కలుగజేస్తాడు. నీకు సరియైన జ్ఞానాన్ని, సత్యవస్తువు యొక్క అనుభవాన్ని గురువు కలుగజేస్తాడు.

చావులేని స్థితి ఒకటి నీ హృదయంలో ఉంది. అది సత్యం అంటున్నారు. అది ఉందా అని భగవాన్‌ను అడిగితే అది ఉంది అని భగవాన్ అనే వారు కాదు. ఉన్నదే అది అనేవారు. ఉన్నది అది ఒక్కటే అది తప్పించి ఇంక ఏమీ లేదని అర్థం. ఎప్పడు మాట్లాడినా, ఏది మాట్లాడినా మనిషిని లోపలకు తీసుకొనివెళ్లటానికే చూసేవారు. నీ హృదయంలో భగవంతుడు ఉన్నాడు అని చెప్పటం పాక్షిక సత్యం. నీకు అర్థమవ్వటం కోసం విషయం అలా చెప్పాడు గాని అది పూర్ణ సత్యం కాదు. అయితే పాక్షిక సత్యం పూర్ణ సత్యం తెలుసుకోవటానికి సహకరిస్తుంది. పూర్ణ సత్యం ఎపుడైతే నీకు అనుభవంలోనికి వచ్చిందో నీకు స్వేచ్ఛ కలుగుతుంది, శాంతి కలుగుతుంది.